

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 8,21,411
బంగారం	3 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
వెండి	29 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

-భువనేశ్వర్/పూరీ



అంబరాన్నంటిన సంబరాలు

గజపతి ఉత్సవాలు అంబరాన్నంటాయి. లేబర్ కమిషనర్ అనుపమ్ సాహో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- 8లో



నేటి నుంచి సాగర సంబరాలు

గోపాల్‌పూర్‌లో నేటి నుంచి సాగర సంబరాలు మొదలవుతాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

స్వచ్ఛ కార్యకర్త నిజాయితీ



యజమానికి గొలుసు అందజేస్తున్న పారిశుద్ధ్య కార్యకర్త

భువనేశ్వర్: స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ స్వచ్ఛ కార్యకర్త నిజాయితీ చాటుకున్నారు. రోజు మాదిరిగా వ్యర్థాలు సేకరిస్తుండగా పాడి చెత్తలో లాకెట్‌తో కూడిన బంగారు గొలుసు గుర్తించారు. ఈ విషయం బీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గొలుసు స్థానిక ఇన్‌ఫో సిటీ ప్రాంతంలో ఉంటున్న అర్పితా సాహుకి చెందినదిగా గుర్తించారు. అక్కడికి వెళ్లి యజమానికి గొలుసు అప్పగించినట్లు నగర మేయరు సులోచనదాస్ తెలిపారు.

గంజాయి ముఠా గుట్టురట్టు



పోలీసులు సీజ్ చేసిన ట్రక్కు

జయపురం: జార్ఖండ్ రాష్ట్రానికి గంజాయి తరలించేందుకు వెళ్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం హౌడా బణబీహార్‌కు చెందిన ట్రక్కు డ్రైవర్ రామనాథ్ రాయ్, కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్ పరిధిలోని లమతాపుట్‌కు చెందిన ప్రదీప్ కుమార్ సెఠిలు శుక్రవారం రాత్రి ట్రక్కులో వెళ్తుండగా జయపురం- కొరాపుట్ ఘాట్ రోడ్డులో పోలీసులు అనుమానం వచ్చి ఆపారు. సిబ్బంది తనిఖీ చేయగా నాలుగు ఖాళీ కర్ర పెట్టెలు, ఐదు ఇనుప పైపులు, డ్రైవర్ సీటు కింద అరలో 500 నోట్ల కట్టలు గుర్తించారు. డబ్బుల విషయం ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపారు. గంజాయి పంట పండించేందుకు ప్రదీప్‌కు లక్ష రూపాయిలు ఇచ్చామని, పండిన పంటను రవాణా చేసేందుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. ఏఎస్‌ఐ నవీణకుమార్ టొప్పొ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డికుప్పలో మహిళ మృతదేహం

మల్కన్‌గిరి: తుమ్సాపల్లి పంచాయతీ ఎం.పి.వి-3లో నివాసముంటున్న శ్రీకాంత్ కిర్సనీయ భార్య కర్తన్య(45) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 18న రాత్రిపూట కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన కర్తన్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్నిచోట్లా వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో గ్రామపరిధిలోని ఓ గడ్డికుప్ప వద్ద ఆవుల కోసం గడ్డితీస్తున్న స్థానికులకు అందులో మహిళ మృతదేహం కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మల్కన్‌గిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఆహ్వానం




స్వామివారికి ఆహ్వానం అందిస్తున్న శ్రీమందిరం ప్రతినిధుల బృందం

భువనేశ్వర్: పూరీజగన్నాథ ఆలయం చుట్టూ నవ నిర్మిత వారసత్వ ప్రాకారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా జగన్నాథ ఆలయ నిర్వాహకుల బృందం శనివారం పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతికి ఆహ్వానపత్రం అందజేసింది. జగన్నాథ ఆలయ పరిపాలన (ఎస్‌జేటీఏ) ప్రధాన పాలనాధికారి (సీఏఓ) రంజన్‌కుమార్ దాస్, పాలక మండలి సభ్యుడు అశోక్ మహాపాత్రో, దుర్గాప్రసాద్ మహాపాత్రో, మాధవ్ చంద్ర మహాపాత్రోలతో కూడిన ప్రతినిధులు శుక్రవారం శంకరాచార్య ఉన్న మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి వెళ్లారు. జనవరి 17న జరగనున్న కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా పూరీ గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు స్వామి నిశ్చలానంద సరస్వతికి అధికారిక ఆహ్వానాన్ని అందించారు. పూజ, యజ్ఞ హోమాదుల విధి విధానాల్ని చర్చించారు.

శ్రీనివాసా గోవిందా!

- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు
- కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- వేకువజాము నుంచే ఉత్తర ద్వార దర్శనాలు



బరంపురం: బంగారు ఆభరణాలు, పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి



రాయగడ: విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాయగడ:

ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వేకువజాము నుంచే ఆలయాల వద్ద భారీ క్యూలైన్లు కనిపించాయి. రాయగడలోని బాలాజీ నగర్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి మందిరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రామ్‌జీ ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు, అలంకరణలు జరిగాయి.



రాయగడ: ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

కాళీయ మర్దన అవతారంలో..

పర్లాకిమిడి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పర్లాకిమిడిలోని కోమటివీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం గుండా వెళ్లి కాళియమర్దన అవతారంలో ఉన్న శ్రీనివాసున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అంగరంగ వైభవంగా ఊరేగించారు. ప్రధాన అర్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు, చక్రధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



భువనేశ్వర్: జాజ్‌పూర్ వేంకటేశ్వర ఆలయంలో గరుడ వాహనంపై స్వామివారు



రాయగడ: భక్తులతో కిటకిటలాడిన మందిరం



పర్లాకిమిడి: కాళీయ మర్దన అవతారంలో శ్రీనివాసుడు

పోటెత్తిన భక్తజనం..

బరంపురం: వైకుంఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా బరంపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు అనంతరం స్వామివారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం 4 గంటల నుంచే భక్తులు బారులు తీరారు.



బరంపురం: వెంకన్నకు అభిషేకాలు చేస్తున్న అర్చకస్వాములు



బరంపురం: శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పర్లాకిమిడి: వేంకటేశ్వర ఆలయ సన్నిధిలో తిరువీధి ఉత్సవం

కోవిడ్ కలకలం

- తాజాగా ఒడిశాలో మరో కేసు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడి
- పాజిటివ్‌గా గుర్తించిన వ్యక్తికి ఇంట్లోనే చికిత్స
- అప్రమత్తమైన రాష్ట్ర యంత్రాంగం

భువనేశ్వర్: కోవిడ్-19 కొత్త సబ్ వేరియంట్ - జేఎన్.1 ఒడిశా రాష్ట్రంలోనూ కలకలం రేపుతోంది. రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి కోవిడ్ -19 పాజిటివ్ బారిన పడినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ప్రకటించింది. రాష్ట్రాల వారీగా జారీ చేసిన వివరాల్లో ఈ విషయం వెల్లడించింది. సదరు వ్యక్తి ఇంట్లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఆరోగ్యం నిలకడగా కొనసాగుతోందని అనుబంధ వర్గాల సమాచారం. రాష్ట్రంలో ఈ నెల 3న చివరి కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. 20 రోజుల విరామం తర్వాత తాజాగా మరో కేసు నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ధ్రువీకరించింది.

కేసులు పెరిగే అవకాశం..

కొత్త ఉప వేరియంట్ వ్యాప్తి విస్తరించే అవకాశం ఉన్నందున యంత్రాంగం అప్రమత్తమైంది. కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుందని నిపుణుల అంచనా. అయితే కొత్త వేరియంట్ రోగులకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించకపోవచ్చు. అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవిడ్ మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు బయటకు వెళ్లేటప్పుడు మాస్కు ధరించాలని, రద్దీగా ఉండే ప్రదేశాలను సందర్శించకుండా జాగ్రత్త వహించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ సూచించింది. సందిగ్ధ రోగ లక్షణాల ధృవీకరణకు నిర్వహించే పరీక్షలను వేగవంతం చేయడానికి, నిఘా వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్రం అన్నివిధాలా సిద్ధమైందని తెలిపారు.




41 దేశాలలో..

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) జారీ చేసిన వివరాల ప్రకారం సబ్ వేరియంట్ ప్రపంచ వ్యాప్తంగా 41 దేశాలలో విస్తరించింది. కేరళ వంటి ఇతర రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నందున తేలికపాటి లక్షణాలు ఉన్న చాలా మంది రోగులు ఇంటిలో ఉంటూ చికిత్స పొందుతున్నారు. సబ్ వేరియంట్ జేఎన్.1 కేసుల పెరుగుదల నేపథ్యంలో దేశంలో 752 కరోనా వైరస్ సంక్రమణ అకస్మాత్తుగా పెరిగింది. నాలుగు మరణాలు నమోదయ్యాయి. కేరళలో ఇద్దరు, రాజస్థాన్, కర్ణాటకలలో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. కేరళ (266), కర్ణాటక (70), మహారాష్ట్ర (15), తమిళనాడు (13), గుజరాత్ (12) సహా పదిహేడు రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదయ్యాయి.

మాజీ గవర్నర్ ఎం.ఎం.రాజేంద్రన్ కన్నుమూత

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ గవర్నర్ ఎం.ఎం.రాజేంద్రన్(88) చెన్నైలో అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుశీల రాజేంద్రన్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రాజేంద్రన్ 1957 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ టాపర్. తమిళనాడు చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. 1964లో రామనాథపురం జిల్లా కలెక్టర్‌గా ధనుష్‌కొడిలో తుఫాన్ బీభత్సం సృష్టించాక అక్కడి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొన్నారు. 1999లో రాష్ట్రం పెను తుఫాన్‌తో అతలాకుతలమైన విపత్కర పరిస్థితుల్లో ఆయన ఒడిశా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. పూర్వ అనుభవంతో సహాయక చర్యలు సమర్థంగా నిర్వహించారు. ఈ ఏడాది జూలైలో రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఒడియాలో అనువదించి తన ఆత్మకథ కాపీని అందజేశారు. విపత్తు సహాయం, సంసిద్ధత, రాష్ట్రంలో ఉన్నత విద్య అభివృద్ధికి ఆయన అందించిన సేవల్ని రాష్ట్రపతి అభినందించారు. రాష్ట్ర ప్రజల హృదయాల్లో ఇప్పటికి ఆయన గవర్నరుగా గుర్తుండటం విశేషం. 2004 వరకు గవర్నర్ హోదాలో పూర్తి కాలం బాధ్యతల్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వ్యవధిలో ముగ్గురు ముఖ్యమంత్రులతో చక్కటి సంబంధాలు నెలకొలుపుకుని పాలనకు సారథ్యం వహించారు. యూనిసెఫ్ కార్యనిర్వాహక మండలి సభ్యుడిగా, న్యూయార్క్‌లోని యూనిసెఫ్ ప్రోగ్రామ్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా సేవలందించారు. రాజేంద్రన్ మృతి పట్ల ప్రస్తుత రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ సంతాపం ప్రకటించారు.



ఎం.ఎం.రాజేంద్రన్(ఫైల్)

ముఖ్యమంత్రి సంతాపం

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ గవర్నర్ ఎం.ఎం. రాజేంద్రన్ మృతి పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రగాఢ సంతాపం తెలిపారు. బ్యూరోక్రాట్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనకు అడ్మినిస్ట్రేటర్‌గా సముచిత స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందించిన సేవలతో ఎప్పటికీ గుర్తుంటారని శ్రద్ధాంజలి ఘటించారు.

పాండ్యన్‌కు వినతుల వెల్లువ

- కొరాపుట్ జిల్లాలో 5టీ ఛైర్మన్ సుడిగాలి పర్యటన
- సుమారు 20 వేల వినతిపత్రాల స్వీకరణ



కొరాపుట్‌లో వృద్ధుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పాండ్యన్



కొరాపుట్ ప్రభుత్వ కళాశాలలో హాజరైన విద్యార్థులు



విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న పాండ్యన్

కొరాపుట్/జయపురం: రాష్ట్ర 5టీ ఛైర్మన్ వి.కార్తికేయ పాండ్యన్ కొరాపుట్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. శనివారం ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ నుంచి జయపుర్‌కు వచ్చిన ఆయన అక్కడి నుంచి రోడ్డు మార్గాన కొరాపుట్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. బీజేడీ పార్టీలో రాజకీయ రంగ ప్రవేశం అనంతరం తొలిసారిగా కొరాపుట్ వస్తుండంతో అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ప్రతి జంక్షన్‌లో వేలాది మంది పూలవర్షం కురిపించారు. ప్రతి చోటా ఆగి ప్రజలతో ముచ్చటించిన పాండ్యన్‌కు పలువురు వినతిపత్రాలు అందజేశారు. కొరాపుట్ డీఏవీ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం 5టీ ద్వారా విద్యారంగంలో చేపట్టిన ఆధునిక మార్పులను వివరించారు. కొరాపుట్‌లో నాలుగు జిల్లాలకుగాను జయపూర్‌లో విక్రందేవ్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు సీఎం నవీన్ కృషి వల్లే సాధ్యమైందన్నారు. ప్రస్తుతం కొరాపుట్ జిల్లాలో ప్రతి గిరిజన కుటుంబం నంచి పిల్లలు చదువుకుంటున్నారని చెప్పారు. ఉన్నత విద్య చదివితే వెంటనే ఉపాధి దొరుకుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. కళాశాల నుంచి తిరిగి వస్తుండగా గేటు వద్ద అధిక సంఖ్యలో వృద్ధులు ఉండటం చూసి కాన్వాయ్ దిగారు. ప్రస్తుతం రూ.500 మాత్రమే పింఛన్ అందుతోందని, రు.1000కి పెంచాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ రు.5 లక్షల బీమా కలిగిన బీజూ ఆరోగ్య బీమా కార్డులు, బియ్యం కార్డులు ఇవ్వాలని పాండ్యన్ అధికారులను ఆదేశించారు. పింఛన్ పెంపు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల వినతులు స్వీకరించారు. అందులో 80 శాతం వినతులు వారం రోజుల్లో పరిష్కరిస్తానని హామీఇచ్చారు. బీజేడీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బబి దాస్, ప్రకాష్ మహంతి, కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్ పాణిగ్రాహీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సరంగి

రాయగడ: జిల్లాలోని మునిగుడలో నిర్మించిన సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని శనివారం హైకోర్టు జడ్జి(యాక్టింగ్) జస్టిస్ బి.ఆర్.సరంగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం అందుబాటులోకి రావడంతో కేసులు వేగవంతంగా పరిష్కారమయ్యే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ బి.పి.సతపతి, మునిగుడ న్యాయవాదులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు అరికట్టాలి



సదస్సుకు హాజరైన ఏఎన్‌ఎం విద్యార్థినులు

జయపురం: మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెనా అన్నారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ, జయపురం జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్రా సూచనల మేరకు స్థానిక ఏఎన్‌ఎం శిక్షణా కేంద్రంలో శనివారం మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ సరస్వతీ బెహరా, పారాలీగల్ స్వచ్ఛంద సేవి సోమనాథ్ మహంతి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యకర్త దేవేంద్ర కహార్, నీలాంచల పాణిగ్రహి, దుర్యోధన నాయిక్, శ్యామసుందర బారిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

విక్రమ్‌దేవ్ వర్సిటీ ప్రగతిపై సమీక్ష



సమావేశంలో చర్చిస్తున్న విభాగాధిపతులు

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రథమ అకాడమీ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. వర్సిటీ క్యాంపస్‌లో ఓఎస్‌డీ ప్రొఫెసర్ దేవప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చాన్సలర్ నామినేట్ ప్రతినిధి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ దాస్, రిజిస్ట్రార్ డాక్టర్ గోపాల హల్దార్, పి.జి. కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కీయక చంద్ర జెనా, పరీక్షల నియంత్రణ అధికారి రంజన్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ప్రారంభం నుంచి నేటి వరకు జరిగిన ప్రగతిపై చర్చించారు. 2023–24 అకడమిక్ క్యాలెండర్‌తో పాటు పీహెచ్‌డీ పాఠ్యాంశాలకు ఆమోదం లభించినట్లు వెల్లడించారు. సమావేశంలో విభాగాధిపతులు డాక్టర్ ప్రసాద్‌కుమార్ పాత్రో, డాక్టర్ సుజిత్ కుమార్ దేహురి, లంబోదర మఝి, జ్ఞానరంజన్ మహంతి, కమల లోచన మహలిక, డాక్టర్ బిజయ కుమార్ శెట్టి, డాక్టర్ రుషభ కుమార్ సాహు, డాక్టర్ అరుణకుమార్ రాజ్, లెఫ్టినెంట్ లక్ష్మణ పాత్రో, డాక్టర్ సాగరిక మిశ్రా, డాక్టర్ దేవధర ఇందోరియ, డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

సంతబొమ్మాళి: మండలంలోని కొల్లిపాడు గ్రామంలో డి.మాకయ్య అనే వ్యక్తి రొయ్యల చెరువుకు అక్రమంగా విద్యుత్ చౌర్యం చేయడంతో కేసు నమోదు చేసినట్లు టెక్కలి విద్యుత్‌శాఖ ఏడీ ఈ ఎస్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాచారం మేరకు పరిశీలించగా విద్యుత్ చౌర్యం జరిగినట్లు గుర్తించామని అన్నారు. అసెస్‌మెంట్ రూ. 2,64,722లు కాంపౌండ్‌గా రూ. 38వేలు మొత్తం రూ. 3,02,722 ఫైన్ వేశామని అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతిచెందిన పోలిరెడ్డి

ఎచ్చెర్ల, లావేరు: లావేరు మండలంలోని కేశవరాయునిపాలేం గ్రామంలో గుజ్జి పోలిరెడ్డి (28) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోలిరెడ్డి తన భార్య గౌరితో కలిసి విశాఖపట్నంలో పాత ఇనుపకొట్టులో పనిచేసి జీవనం గడిపేవాడు.ఇరవై రోజుల కిందటే ఆయన స్వగ్రామానికి కుటుంబంతో సహా వచ్చేశారు. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో పోలిరెడ్డి తండ్రి ఎరకయ్య, తమ్ముడు శ్రీనులు కల్లం వద్ద పడుకునేందుకు వెళ్లగా అక్కడ పోలిరెడ్డి తీవ్ర గాయాలతో కనిపించాడు. హుటాహుటిన ఇంటికి తీసుకెళ్తుండగా దారిలోనే మృతి చెందారు. భార్య గౌరీ పిర్యాదుమేరకు లావేరు ఎస్‌ఐ కోటీశ్వరరావు కేసు నమోదుచేశారు. సీఐ ఆదాం కేసు దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ శృతి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

అంబరాన్నంటిన సంబరాలు

- నాలుగో రోజు గజపతి ఉత్సవాలకు హాజరైన లేబర్ కమిషనర్ అనుపమ్ సాహా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మూడేళ్లకు పైగా కలెక్టర్‌గా పనిచేసి గుర్తింపు పొందిన రాష్ట్ర లేబర్ కమిషనర్, ఒడిషా స్కూల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం అథారిటీ (ఓసేపా) డైరెక్టర్ అనుపం సాహా నాలుగో రోజు గజపతి ఉత్సవాలకు గౌరవ అతిథిగా విచ్చేశారు. ముందుగా గజపతి మహారాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోవిడ్, తిత్లీ తుఫాన్ వల్ల తన హయాంలో గజపతి ఉత్సవాలు నిర్వహించలేకపోయానని, ఇప్పుడు ముఖ్యఅతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ స్మృతి రంజన్ పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో అనుపంను సన్మానించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. పూరీ గోట్టిపువా, సంబల్‌పురి నృత్యం, టిబెటియన్ నృత్యం, సమల్లై, శిశువిద్యామందిర్, మిరాకిల్ డ్యాన్స్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, అదనపు కలెక్టర్ బిరేంద్రకుమార్‌దాస్, ఏడీఎం రాజేంద్రమింజ్, సమగ్ర గిరిజనాభివృద్ధి పీఓ ఫాల్గుణీ మఝి, సబ్ కలెక్టర్ ఆలోక్ ప్రధాన్, మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి తదితరులు పాల్గొన్నారు.



గజపతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న అనుపం సాహా



ఒడియా జగన్నాథ నృత్యం



డ్యాన్సు కళాకారులను అభినందిస్తున్న అనుపం సాహా



సంబల్‌పురి కళాకారులకు పురస్కారం అందజేసిన గంగాధర్ వర్సిటీ చాన్సలర్ ఎన్.నాగరాజు



పురస్కారాలతో అతిథులు

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి
- ఘనంగా సెంచూరియన్ విద్యాసంస్థల 13వ వార్షికోత్సవం



ఒడిస్సీ నృత్య ప్రదర్శన



వేదికపై ఎమ్మెల్యే ముదులి, రాజేష్ పాఢి, గంతాయిత్ తదితరులు



చిన్నారుల నృత్యప్రదర్శన

రాయగడ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి ఆకాంక్షించారు. స్థానిక పితామహల్‌లో సెంచూరియన్ విద్యాసంస్థల 13వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. 5టీ పథకంలో భాగంగా స్మార్ట్ తరగతులు, ఈ–లైబ్రరీలు, పాఠశాలల ఆధునీకరణ చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. పోటీతత్వాన్ని ఎదుర్కొనేందుకు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం, విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ రాజేష్‌కుమార్ పాడి మాట్లాడుతూ రాయగడలో తమ విద్యాసంస్థలకు మంచి ఆదరణ ఉందన్నారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం సెంచూరియన్ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆర్.కె.మహాపాత్రో సంస్థల వార్షిక నివేదికను వివరించారు. కార్యక్రమంలో రాయగడ అటానమస్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కె.గంతాయిత్, సుస్మిత మహంతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు..

వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఒడిస్సీ, సంబల్‌పురీ నృత్యాలతో పాటు ఆధునిక నృత్య ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంబల్‌పురీ నృత్య ప్రదర్శన



విద్యార్థినుల నృత్యాలు

నేటి నుంచి గోపాల్‌పూర్ సాగర సంబరాలు



సంబరాలకు సిద్ధమవుతున్న గోపాల్‌పూర్ తీరం

- ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్ దివ్యా జ్యోతి పరిడా



మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యా జ్యోతి పరిడా

బరంపురం: అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిన గోపాల్‌పూర్‌లో ఆదివారం నుంచి సాగర సంబరాలు ప్రారంభమవుతాయని జిల్లా కలెక్టర్ దివ్యా జ్యోతి పరిడా చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఛత్రపూర్‌లో డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సాగర సంబరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబరాల్లో భాగంగా పల్లెశ్రీ మేలా, పుస్తక మేలా కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివిధ జిల్లాలకు చెందిన ఎస్‌ఎస్‌జీ గ్రూప్ మహిళలు తయారు చేసిన హస్తకళా వస్తువులు, వివిధ సామగ్రి విక్రయించనున్నట్లు తెలిపారు. గంజాం జిల్లా కళా సంస్కృతి పరిరక్షించటం సంబరాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. స్థానిక కళాకారులతో పాటు బాలీవుడ్, ఓలీవుడ్ కళాకారుల సంగీత నృత్య ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బరంపురం ఎస్పీ సర్వాణ్ వివేక్, బీఎంసీ కమిషనర్ సోనా జెన్నా, జిల్లా పీడీ డైరెక్టర్ కీర్తి వాసన్, బరంపుర సబ్–కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆల్ఫా క్లబ్



చాంపియన్ ట్రోఫీతో ఆల్ఫా క్లబ్ జట్టు



రన్నర్స్‌గా నిలిచిన లీడ్స్ స్పోర్టింగ్ క్లబ్

బరంపురం: స్థానిక బరంపురం క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న టీ20 క్రికెట్ టోర్నీలో ఆల్ఫా క్రికెట్ క్లబ్ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్స్‌లో లీడ్స్ స్పోర్టింగ్ క్లబ్‌పై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. విన్నర్, రన్నర్‌లకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా

బరంపురం: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా ఆకాంక్షించారు. శనివారం స్థానిక శశిభూషణ్ రథ ఉమెన్స్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని అవరోధాలు ఎదురైనా లక్ష్య సాధన నుంచి వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలన్నారు. అలుపెరగకుండా స్పష్టమైన లక్ష్యంతో శ్రమిస్తే తప్పక విజయం సొంతమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదన్ మోహన్, మాజీ ఎమ్మెల్యే చావ్ పట్నాయక్, బీడీఏ చైర్మన్ సుభాష్ మహరాణా, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

'సీఎంఓ దృష్టికి బెంతు ఒరియాల సమస్య'



బెంతు ఒరియా సంఘ నాయకులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బెంతు ఒరియా కులస్తులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను సీఎంఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన బెంతు ఒరియా కుల పెద్దలతో మాట్లాడారు. తమకు బెంతు ఒరియా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దక్కడం లేదని, ఉన్నత చదువులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయని బెంతు ఒరియా సంఘ నాయకులు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి నెలలో తమకు ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని, మళ్లీ వాటిని వాపసు తీసుకున్నారని తెలిపారు. ఈ సమస్యను కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట పలాస ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్ పి.మీనాదేవి, ఉప తహసీల్దార్‌లు ఎస్.గురుప్రసాద్, బి.శ్రీహరి, బెంతు ఒరియా సంఘ నాయకులు శివ బిసాయి మాష్టార్, దేవరాజు సాహూ, దుద్దిష్టి మఝ్జి, సుమన్ బిసాయి, శ్రీకాంత్ పురియా, నవీన్ బిసాయిలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి రోల్ ప్లే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సత్యవరం విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రాలు ఇస్తున్న డైరెక్టర్ హేమరాణి

నరసన్నపేట: సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రోల్ ప్లే పోటీల్లో ద్వితీయ స్థానం పొంది ప్రతిభ చూపారు. ఏలూరు జిల్లా తోటపల్లిలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ(ఎస్‌సీఈఆర్టీ), రాష్ట్ర విద్యా శాఖ ఈనెల 22న పోటీలు నిర్వహించింది. ఇందులో పాల్గొన్న హైస్కూల్ విద్యార్థులు హన్సిక, కళ్యాణి, భార్గవి, ధనుష్‌లు న్యూట్రిషన్ ఫుడ్ అనే అంశంపై రోల్‌ప్లే ప్రదర్శించారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ హేమరాణి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లు అందించారు.

ఆదిత్యుని సన్నిధిలో బుల్లితెర నటి మేఘన

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వైకుంఠ ఏకాదశి నాడు స్వర్ణాలంకరణలో తొలిసారిగా దర్శించుకోవడం నిజంగా చాలా అదృష్టంగా భావిస్తున్నానని బుల్లితెర నటి మేఘనా లోకేష్ అన్నారు. శనివారం ఉదయం ఆమె తొలిసారిగా అరసవల్లి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం అరసవల్లి క్షేత్రం విశిష్టతను ఆమెకు శంకరశర్మ వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్



నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసు, సెబ్ అధికారులు

మందస: గిరిజన గ్రామాల్లో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కొండలోగాం పంచాయతీలోని పలు గిరిజన గ్రామాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎస్పీ జి.రాధిక, ఎస్ఈబీ అడిషినల్ ఎస్పీ వి.మణికంఠ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్టు అధికారులు చెప్పారు. 150 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, సవర తిరుపతి, ప్రభావతి, కుమారిలను అరెస్ట్ చేసి, సోంపేట కోర్టులో హాజరుపరిచామన్నారు. 1400 లీటర్ల పులియబెట్టిన నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఈబీ సోంపేట ఇన్‌స్పెక్టర్ టీవీఏ నాయుడు, కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు, ఇంటిలిజెన్స్ సీఐ బీవీ మురళీధర్, టాస్క్ ఫోర్స్ సీఐ బి.నరసింహామూర్తి, మందస ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. స్థిరమైన పదార్థాలు, నిర్మాణ పద్ధతులు, ప్రస్తుత పద్ధతులు, భవిష్యత్ మార్పులపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్అండ్‌టీకి చెందిన దాసం కిశోర్‌కుమార్ హాజరై, వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ పి.మార్కొండేయరాజు, కన్వీనర్ సాగి మురళీసాగర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


మృతుడు ఇంతియాజ్(ఫైల్)

డెంకాడ: మండలంలోని మోదవలస వద్ద విజయనగరం-విశాఖపట్నం జాతీయ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహ్మద్ ఇంతియాజ్(27) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ ఎస్.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖపట్నం నుంచి విజయనగరం వైపు వస్తున్న లారీ, అదే దారిలో మోటార్ సైకిల్‌తో వస్తున్న ఇంతియాజ్‌ను ఢీకొంది. దీంతో కిందపడిన ఇంతియాజ్ తలకు తీవ్రగాయం కాగా, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన వెనక కూర్చొని ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల నిమిత్తం క్షతగాత్రుడిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అదే ఆస్పత్రికి మృతదేహం కూడా తరలించారు. మృతుడిది విశాఖపట్నం జిల్లాలోని గోపాలపట్నంగా తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా: మహిళ మృతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడిన దుర్ఘటనలో కోరాడ అప్పలనరసమ్మ(57) అనే మహిళ శనివారం మృతి చెందింది. ఇదే ఘటనలో పాండ్రంకి విజయ, బార్నాల సూర్యకళ అనే మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. గ్రామంలో వరినూర్పు పనులు ముగించుకుని, ట్రాక్టరులో ఇంటికి వెళ్తుండగా, ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు.

ఊపిరాడక కౌలురైతు..

భామిని: ఊపిరాడక కౌలురైతు పోతల రాములు(65) మృతి చెందాడు. ఈ విషాద ఘటన మండలంలోని లాహోరజోల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. భార్య గౌరమ్మతో కలిసి గ్రామ శివారులోని వరిపొలంలోని గడ్డి కుప్పలకు నిప్పు పెట్టాడు. ఒక్కసారిగా ఎగసిపడిన మంటలు, వ్యాపించిన పొగకు అతడికి ఊపిరి ఆడలేదు. దీంతో ఉన్నచోటనే కుప్పకూలిపోయి విలవిలలాడుతూ ప్రాణాలు విడిచాడు. కళ్లెదుటే భర్త చనిపోవడాన్ని భార్య తట్టుకోలేకపోయింది. మృతదేహంపై పడి బోరున విలపించింది. మృతుడికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు.

రంగుమారిన ధాన్యం కొనుగోలు

విజయనగరం ఫోర్ట్: మిచాంగ్ తుఫాన్ వర్షాలతో తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ సలహామండలి సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు మిల్లులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సేకరిస్తున్న ధాన్యం మాత్రమే మిల్లులు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం బాగులేదని వెనక్కి పంపించకుండా చూడాలని సివిల్ సప్లై డీఎం మీనాకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా జేసీ, సివిల్ సప్లై డీఎం, సీఎస్‌డీటీకి ఫోన్ చేయాలన్నారు. రైతులకు అన్‌లోడ్, రవాణా చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. జిల్లాలో ఇంతవరకు 63,845 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 11,326 మంది రైతులకు 3 రోజుల్లోనే చెల్లించడం జరుగుతుందన్నారు. సుమారు రూ.100 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇప్పటివరకు రూ.82 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. అన్ని గిడ్డంగుల నిర్వహణకు మార్కెటింగ్, వ్యవసాయ శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 19 లక్షల గోనె సంచులు రైతులకు అందించామని, ఇంకా అవసరమని ప్రతిపాదనలు పంపిస్తే గోనె సంచులు సరఫరా చేస్తామని జేసీ మయూర్ అశోక్ తెలిపారు. ధాన్యం విక్రయించే రైతులకు ఇబ్బంది లేకుండా సీఎస్‌డీటీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. కస్టోడియన్ ఆఫీసర్లను సైతం అలర్ట్‌చేశామని చెప్పారు. మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశామన్నారు. మిల్లర్ల వద్ద ఏవైనా కొర్రీలుంటే కాల్ సెంటర్‌కు నేరుగా ఫోన్‌చేయాలని చెప్పారు. ఈ ఏడాది జిల్లాలో 40 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, పశు సంవర్ధకశాఖ విశ్వేశరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) మెరుగుపడ్డ సేవలు
- అందుబాటులో 63 రకాల పరీక్షలు
- నాలుగున్నరేళ్లలో 77.29 లక్షల మందికి వైద్యం
- మరో 24.46 లక్షల మందికి రక్తపరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 48 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు


రాకోడు పీహెచ్‌సీలో గర్భిణికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ ఎక్కిస్తున్న దృశ్యం

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారు. నాడు-నేడు పథకం కింద ఇప్పటికే ఆస్పత్రులను అభివృద్ధి చేయగా, ఆ తర్వాత పీహెచ్‌సీల దగ్గర నుంచి ఏరియా ఆస్పత్రుల వరకు అన్నింట్లో వైద్యసిబ్బంది కొరత లేకుండా జాగ్రత్త వహించి, సకాలంలో జనానికి వైద్యసేవలు అందేలా చేసింది. దీంతో పాటు గ్రామాల్లోనే వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ రావడం జరుగుతోంది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత గ్రామీణులకు ఆరోగ్య భరోసానిచ్చే పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లో సమూలమైన మార్పులు వచ్చాయి. గతంలో టీడీపీ హయాంలో పీహెచ్‌సీల్లో పరిస్థితులు చాలా అధ్వానంగా ఉండేవి. వైద్యులు, సిబ్బంది, మందుల కొరత విపరీతంగా ఉండేవి. ఇప్పుడు అవేవీ లేకుండా రోగులకు అవసరమైన సేవలన్నీ సకాలంలో లభిస్తున్నాయి. దీంతో జగనన్న పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు..

2019కు ముందు టీడీపీ హయాంలో ఒక పీహెచ్‌సీకి ఒక్క వైద్యుడు మాత్రమే ఉండేవారు. ఆ వైద్యుడు ఏదైనా పని నిమిత్తం సెలవు పెడితే చాలు ఆస్పత్రిని ఆశ్రయించే వారికి సేవలు కరువయ్యేవి. అటువంటి దుస్థితి ఉండకూడదన్న సదుద్దేశ్యంతో ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఒక వైద్యుడు సెలవులో ఉంటే మరో వైద్యుడు కచ్చితంగా పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటున్నారు. దీంతో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు నిత్యం అందుతున్నాయి. ఇదిలా ఉండగా, గతంలో పీహెచ్‌సీలో ఒక స్టాఫ్‌నర్సు ఉంటే ఇప్పుడు ఏకంగా ముగ్గురు స్టాఫ్‌నర్సులు అందుబాటులో ఉంటున్నారు. వీరితో పాటు ఎంఎస్‌వో, ఎఫ్‌ఎన్‌వోను కూడా నియమించారు. ఇదివరకు రెండు, మూడు పీహెచ్‌సీలకు ఒకేఒక ల్యాబ్ టెక్నీషియన్ ఉంటే, ప్రస్తుతం ప్రతి పీహెచ్‌సీకి ఓ ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. గతంలో 10, 14 రకాల వైద్య పరీక్షలు మాత్రమే చేశారు. ప్రస్తుతం 63 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. అప్పట్లో 5, 10 పీహెచ్‌సీల్లో మాత్రమే 24 గంటల సేవలుండేవి. ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా ఉన్న 48 పీహెచ్‌సీల్లోనూ 24 గంటల సేవలు అందుబాటులో ఉన్నాయి. గతంలో కొన్ని పీహెచ్‌సీల్లో మాత్రమే ప్రసవాలు చేసేవారు, ఇప్పుడు అన్ని పీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు చేస్తున్నారు. ప్రసవానికి అవసరమైన గదులను ప్రతి పీహెచ్‌సీలో ఆధునీకరించారు.

జిల్లాలోని 48 పీహెచ్‌సీల్లో..

2019 నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 48 పీహెచ్‌సీల్లో 77.29 లక్షల మందికి వైద్యసేవలు అందించారు. అలాగే 24.62 లక్షల మందికి వైద్యపరీక్షలు చేశారు.


రాకోడు పీహెచ్‌సీలో రక్తపరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

రాత్రి వేళల్లోనూ సేవలు..



ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పథకం పనుల ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మారాయి. పీహెచ్‌సీలతో పాటు ప్రధాన ఆస్పత్రుల్లోనూ రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్యసేవలు, వైద్యపరీక్షలు, అందుబాటులో ఉన్నాయి. రాత్రి వేళల్లోనూ ఇప్పుడు పీహెచ్‌సీల్లో సేవలందిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో.

2019 నుంచి 2023 నవంబరు నెలాఖరు నాటికి అందించిన వైద్యసేవలు, వైద్యపరీక్షల వివరాలిలా ఉన్నాయి..

సంవత్సరం	వైద్యసేవలు	వైద్యపరీక్షలు
2019-20	18,30,368	5,89,860
2020-21	14,04,382	2,76,384
2021-22	19,06,334	4,94,148
2022-23	15,91,841	5,74,532
2023-24	9,96,686	5,27,219

బాగా చూస్తున్నారు..



నాకు సుగర్ వ్యాధి ఉంది. ఎప్పటికప్పుడు టెస్ట్ చేసుకోవడానికి వెళ్తున్నాను. పీహెచ్‌సీలో ఇప్పుడు చాలా బాగా చూస్తున్నారు. డాక్టర్ పరీక్ష చేయించుకోమని చెప్పగానే ల్యాబ్‌కు వెళ్తే అక్కడి ల్యాబ్ టెక్నీషియన్ నాకు షుగర్ పరీక్ష చేసి, రిపోర్టు కూడా త్వరగానే ఇచ్చేశారు.

– చెల్లూరు కృష్ణమ్మ, పినవేమలి గ్రామం, విజయనగరం మండలం.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం


శ్రీశర్వణన్‌ను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం టౌన్: దేశానికి రైతే వెన్నెముక అని, అటువంటి రైతును గౌరవించుకోవడం బాధ్యతగా భావించాలని కోయంబత్తూరుకి చెందిన శ్రీశర్వణన్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కల్టివేటింగ్ ది ఫ్యూచర్ ఇన్నోవేషన్ అండ్ సస్టైనబులిటీ ఇన్ అగ్రికల్చర్ అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆహార భద్రతకు రైతులు చేస్తున్న అమూల్యమైన సహకారాన్ని గుర్తిస్తూ ఏటా జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సీతం డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో రైతులది కీలక పాత్రని, వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు సమగ్ర సహాయక వ్యవస్థల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సాంకేతికతను ఉపయోగించుకోవడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, వ్యవసాయాభివృద్ధికి సమగ్ర విధానాన్ని పెంపొందించడంపై విలువైన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


ఎంపికైన జేఎన్‌టీయూ జీవీ జట్టుతో సిబ్బంది

విజయనగరం: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా వేదికగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో అండర్-14 విభాగానికి పి.దుర్గాప్రసాద్, డి.దేవస్వరూప్ ఉండగా, అండర్-19 విభాగానికి సంబంధించి, జి.వసంత్ ఉన్నారు. వీరంతా మహారాష్ట్రంలో జరిగే జాతీయ స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్టు..

విజయనగరం: సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖో పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్టు సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ జీవీ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో జేఎన్‌టీయూ జీవీకి చెందిన టి.విజయ్‌కుమార్, ఎం.తేజతో పాటు విజ్ఞాన్ కళాశాలకు చెందిన బి.హరిప్రసాద్, కె.జగదీష్, రఘు కాలేజీకి చెందిన పి.హర్షవర్ధన్, ఎల్.మనీష్, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన జి.హేమంత్‌కుమార్, జి.సాగర్‌కుమార్, సత్య కళాశాలకు చెందిన జె.సాయిరామ్, జీఎంఆర్ కళాశాలకు చెందిన ఎ.మణికంఠ, ఎం.ఈశ్వర్‌తేజ, ఎస్ఎస్ఆర్ కళాశాలకు చెందిన కె.సాగర్ ఉన్నారు. వీరంతా ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల ఖోఖో పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకుమార్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాపారావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.నాగరాజు తదితరులు అభినందించారు.


జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


తెర్లాం: సాఫ్ట్‌బాల్ పోటీలకు జోద్‌పూర్ పయనమైన క్రీడాకారులు

జోద్‌పూర్‌కు క్రీడాకారుల పయనం..

తెర్లాం: జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు శనివారం పయనమయ్యారు. మహారాష్ట్రలోని జోద్‌పూర్‌లో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే పోటీల్లో వీరంతా పాల్గొననున్నారు. నవంబర్‌లో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా పురుషుల జట్టు తృతీయ స్థానం, మహిళల జట్టు ప్రథమ స్థానం సాధించగా, ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో పురుషుల జట్టులో గొండేల అనీల్‌కుమార్, ఒ.మహేష్ ఉండగా, మహిళల జట్టులో బి.సాయితులసి, బి.సుప్రియ, టి.ప్రశాంతి, పి.మౌనిక ఉన్నారు. జాతీయ పోటీల్లో కూడా విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్రానికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పీడీలు, పీఈటీలు ఆకాంక్షించారు.

తొలి ప్రయత్నంలోనే ఎస్ఐ కొలువు


ఎస్ఐగా ఎంపికైన జగదీష్‌ను అభినందిస్తున్న అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్

పార్వతీపురం: తొలి ప్రయత్నంలోనే ఎస్ఐ(సబ్ ఇన్‌స్పెక్టర్) కొలువు సాధించారు గరుగుబిల్లి మండలం, పెద్దూరుకు చెందిన గుంట్రెడ్డి జగదీష్. ఎలాగైనా ఎస్ఐ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో 2019లో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత రైల్వే ఉద్యోగం సాధించి, చేసినా తృప్తి చెందలేదు. ఎస్ఐ జాబ్ కోసం రాత్రింబవళ్లు శ్రమించి, జోన్-2 ఎస్ఐ పరీక్ష ఫలితాల్లో 250 మార్కులతో 20వ ర్యాంక్ సాధించి, ఎస్ఐగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు రామినాయుడు, పార్వతిలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం జగదీష్‌ను గ్రామస్తులతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ అభినందించారు.

27న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 27వ తేదీన ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని, పురుషులకు రిఫ్రిజిరేషన్ ఎయిర్ కండిషనింగ్(75 రోజులు), కంప్యూటర్ డీటీపీ(45 రోజులు)లలో శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు లేడీస్ టైలరింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు పదోతరగతి మార్కుల లిస్టు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తీసుకునిరావాలన్నారు. జనవరి 2వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, శిక్షణా కాలంలో ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు9014716255, 9491741129, 9866913371, 9989953145ను సంప్రదించాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని కొల్లిపేట గ్రామానికి చెందిన పెంటమాని పెంటయ్య అనే వృద్ధుడు కనిపించకపోవడంపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఈ నెల 19వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో అతని భార్య అంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని సెయింట్ ఆన్స్ బాలికల ఉన్నత పాఠశాలలో దక్షిణ భారత స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన-2023-2024 శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్‌తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా విద్యా శాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి హాజరై, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో గొప్ప ప్రాజెక్టులు రూపొందించి, ప్రదర్శించారని తెలిపారు. విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ప్రశంసించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. మరో అడుగు ముందుకు వేసి, ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేసి, వారి బంగారు భవితకు బాటలు వేశారన్నారు. రాష్ట్రాన్ని విద్యాంధ్రప్రదేశ్ చేయాలనే లక్ష్యంతో సీఎం జగనన్న కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రదర్శనలో మొత్తం 237 ప్రాజెక్టులకుగాను విద్యార్థులు వ్యక్తిగత, గ్రూపు, టీచర్ విభాగాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల వ్యక్తిగత ప్రాజెక్టులు 121, గ్రూపు ప్రాజెక్టులు 101, టీచర్ విభాగంలో 16 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగం నుంచి జెడ్పీహెచ్‌ఎస్,పెరుమాళి విద్యార్థి ఆర్.సిద్ధు (స్మార్ట్‌హౌస్) ప్రథమస్థానం సాధించారు. జెడ్పీహెచ్‌ఎస్, దోలపేట విద్యార్థిని ఐ.హాసిని(స్మార్ట్‌ట్రాలీ)ద్వితీయస్థానం, నెల్లిమర్ల ఎంజేపీ జూనియర్ కళాశాల విద్యార్థిని పి.జ్యోత్స్న(ఉమెన్ సేఫ్టీ) తృతీయ స్థానం సాధించారు. అలాగే గ్రూపు కేటగిరీ నుంచి భోగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.వెంకటేష్, ఎం.చరకుమార్(యాక్సిడెంట్ ప్రివెన్షన్ ఎట్ కర్వ్‌డ్ రోడ్స్) ప్రథమ స్థానం సాధించారు. గుజ్జింగవలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.రాకేష్, సీహెచ్ లక్ష్మీనారాయణ(సోలార్ సైకిల్) ద్వితీయస్థానం, పెదవేమలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.ప్రవీణ్, జి.నగేష్(ట్రిగనోమెట్రికేషన్ అప్లికేషన్స్) తృతీయ బహుమతి సాధించారు. టీచర్స్ కేటగిరీకి సంబంధించి, కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాల, పి.వేణుగోపాల్(మల్టిపుల్ పారలల్ రేయ్స్) ప్రథమ స్థానం, కొట్యాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎ.నరేష్(లోకాస్ట్ టీఎల్ఎమ్) ద్వితీయస్థానం, మరుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, బి.సూర్యప్రకాశ్(రిమోవల్ ఆఫ్ ఫ్లోరిన్) తృతీయస్థానం సాధించారు. కార్యక్రమంలో కెల్ల పీఏసీఎస్ అధ్యక్షుడు కె.వి. సూర్యనారాయణరాజు, డిప్యూటీ డీఈవోలు కె.వాసుదేవరావు, బ్రహ్మాజీరావు, డీసీఈబీ సెక్రటరీ సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవంలో వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు


మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ రాజు


వర్సిటీ సిబ్బందితో డిగ్రీలు పొందిన విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: సాంకేతిక విజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకోవాలని సెంచూరియన్ వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో మూడో స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీలు(పట్టాలు) అందుకోవడంతోనే సరిపెట్టుకోకుండా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, వర్సిటీలో వివిధ కోర్సులు రూపొందించామని, పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆవిష్కరణల దిశగా పయనించడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించామన్నారు. యువత సవాళ్లను ఎదుర్కొనేలా వారిని తీర్చుదిద్దుతున్నామన్నారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లార్సెన్ అండ్ టోబ్రో ఇన్ఫో చీఫ్ పనీష్‌రావు మాట్లాడుతూ తనకు గౌరవ డాక్టరేట్ అందించడం చాలా ఆనందంగా ఉందని, వర్సిటీ అన్నిరంగాల్లోనూ ముందంజలో ఉందన్నారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు డి.ఎన్.రావు మాట్లాడుతూ 2017 నుంచి ఏపీ క్యాంపస్‌లో కోర్సులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 140 మంది విద్యార్థులకు డిగ్రీలు, 12 మందికి బంగారు పతకాలను అందించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ పీకే మహంతి, అధ్యక్షుడు ముక్తికాంత్ మిశ్రా, రిజిస్ట్రార్ పల్లవి, ఒడిశా క్యాంపస్ వీసీ సుప్రియా పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి చుట్టూ భక్త సిరి


బోడికొండ చుట్టూ ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

- రామతీర్థంలోని బోడికొండ చుట్టూ భక్తుల ప్రదక్షిణ
- ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చిన సీతారామస్వామి
- అంగరంగ వైభవంగా మెట్లోత్సవం
- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు


ఉత్తర రాజగోపురం నుంచి దర్శనమిస్తున్న స్వామివారు

నెల్లిమర్ల రూరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శనివారం నిర్వహించిన గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. రామనామాన్ని స్మరిస్తూ బోడికొండ(నీలాచలం) చుట్టూ 12 కిలోమీటర్ల మేర ప్రదక్షిణలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సాగిన ఈ పుణ్యక్రతువులో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు ముందుగా సీతారామస్వామివారికి ఆరాధన, తిరుప్పావై సేవాకాలం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి కార్యక్రమాలను నిర్వహించి వేకువజామున 5 గంటల నుంచి ఉత్తరద్వార దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం సీతారామస్వామి వారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి తిరువీధి ఉత్సవాన్ని జరిపించారు.

వైభంగా కోదండరాముని మెట్లోత్సవం

బోడికొండపై కొలువుదీరిన శ్రీ కోదండ రామస్వామివారి మెట్లోత్సవం సాంస్కృతిక ప్రదర్శనల నడుమ కనులపండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు కోదండ రామాలయానికి చేరుకునే మెట్లను శుభ్రంచేసి పసుపు, కుంకుమలతో బొట్లు పెట్టి అలంకరించారు. సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి, అర్చకస్వాములు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గోపూజ చేపట్టి గిరి ప్రదక్షిణలను ప్రారంభించారు. గిరి ప్రదక్షిణలో సుమారు 10వేల మంది భక్తులు పాల్గొన్నట్టు అంచనా. అందరికీ దేవస్థానం అధికారులు అన్నప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.


స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు